మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :251 శనివారం జూలై 4 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# కోహిర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు చుక్కలు...







- ఎనిమిది రోజులుగా సర్వర్ డౌన్, పట్టించుకోని అధికారులు.
- ఆగిన రిజిస్ట్రేషన్లు ప్రజలకు చుక్కలు. సర్వర్ డౌన్,పరిష్కారంపై నిర్లక్ష్యమంటూ విమర్శలు.
- రిజిస్ట్రేషన్ సేవలు యధావిధిగా ప్రారంభించాలి
- గంటల తరబడి కార్యాలయం వద్ద వేచి చూడటం.
- ఎమ్మార్వో కి చీమకుట్టినట్టు కూడా లేదు.
- సమయంతో పాటు రవాణా ఖర్చులు కూడా వృధా అవుతున్నాయి అని బాధితులు ఆవేదన.




**కోహిర్, జూలై 3 (మనప్రజాప్రతినిధి):** కోహిర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు గత ఎనిమిది రోజులుగా నిలిచిపోయాయి. సర్వర్ సాంకేతిక సమస్యతో భూముల కొనుగోలు, విక్రయాలు, వారసత్వం తదితర రిజిస్ట్రేషన్ ప్రక్రియలు స్తంభించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ పనుల కోసం ప్రతిరోజూ దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు గంటల తరబడి కార్యాలయం వద్ద వేచి చూసినా, సర్వర్ పనిచేయకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీంతో సమయంతో పాటు రవాణా ఖర్చులు కూడా వృధా అవుతున్నాయని బాధితులు వాపోతున్నారు.గత ఎనిమిది రోజులుగా సమస్యకొనసాగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే సర్వర్ సమస్యను పరిష్కరించి రిజిస్ట్రేషన్ సేవలను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.



మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :251 శనివారం జూలై 4 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


## మూడో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తోందా....?



- చిన్న ఘర్షణలు ప్రపంచ సంక్షోభానికి దారితీస్తాయా?
- కృత్రిమ మేధ, డ్రోన్లు, అణ్వాయుధాలతో మారుతున్న యుద్ధ వ్యూహాలు
- శాంతిని కాపాడేది దౌత్యమా... సైనిక శక్తియా?
- ప్రపంచ భవిష్యత్తు యుద్ధంలో కాదు... సహకారంలోనే

డెస్క్, జూలై 3 (మనప్రజాప్రతినిధి): ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణలు, దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఆధునిక ఆయుధాల అభివృద్ధి నేపథ్యంలో మూడో ప్రపంచ యుద్ధంపై చర్చలు మళ్లీ తెరపైకి వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో యుద్ధ పరిస్థితులు నెలకొనడం, మరికొన్ని దేశాల మధ్య రాజకీయ, సైనిక విభేదాలు పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ప్రాంతీయ ఘర్షణలు ఎంత తీవ్రమైనవైనా అవి తప్పనిసరిగా ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయని చెప్పడం సరైంది కాదని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక అనుసంధానం గతంతో పోలిస్తే మరింత బలంగా ఉండటం పెద్ద స్థాయి యుద్ధాలను నివారించే ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తున్నారు.నేటి యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. గతంలో సరిహద్దుల్లో సైన్యాలు తలపడటం మాత్రమే యుద్ధంగా ఉండేది. ఇప్పుడు సైబర్ దాడులు, డ్రోన్ల వినియోగం, కృత్రిమ మేధ ఆధారిత ఆయుధాలు, ఉపగ్రహ వ్యవస్థలపై దాడులు, సమాచార 2

## పోలియో నిర్మూలనలో మరో మైలురాయి..!



- 101.4 శాతం కవరేజీతో లక్ష్యాన్ని మించిన రాష్ట్రం
- 41.53 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు
- మిస్సైన పిల్లలకు ఇంటింటికీ వెళ్లి టీకాలు
- వైద్య సిబ్బంది సేవలను అభినందించిన మంత్రి

2

## రాయలసీమకు పారిశ్రామిక శక్తి

- జేఎస్‌డబ్ల్యూ ప్రాజెక్టులకు శ్రీకారం..!
- కడపలో స్టీల్ ప్లాంట్, సౌర విద్యుత్ ప్రాజెక్టుకు ప్రారంభం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో శంకుస్థాపన
- ఉపాధి, పారిశ్రామికాభివృద్ధికి ఊతమివ్వనున్న ప్రాజెక్టులు
- భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ప్రజలు




2

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు..!

- అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్రం ఆమోదం
- రాష్ట్రపతి ఆమోదంతో జారీఅన నియామక ఉత్తర్వులు
- కొలీజియం సిఫారసులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- నియామక ప్రక్రియ పూర్తి చేసిన న్యాయశాఖ

అమరావతి, జూలై 3 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. దీంతో హైకోర్టులో న్యాయమూర్తుల 2

## డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉప ముఖ్యమంత్రికి నివేదిక..!





- పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఈగల్ విభాగం చీఫ్
- వార్షిక నివేదికను అందజేసిన ఆకే రవికృష్ణ
- గంజాయి, డ్రగ్స్ నియంత్రణ చర్యలపై వివరాలు
- సామాజిక మాధ్యమ నేరాలపై కఠిన చర్యల వివరణ

మంగళగిరి, జూలై 3 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగం వార్షిక నివేదికను ఉప ముఖ్యమంత్రికి అందజేశారు. సమావేశంలో రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఈగల్ విభాగం చేపడుతున్న చర్యలు, వాటి ద్వారా సాధించిన ఫలితాలను నివేదికలో వివరించినట్లు అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు చేపడుతున్న ప్రత్యేక చర్యలపై ఉప ముఖ్యమంత్రికి వివరించారు.సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించి కూడా పలు అంశాలను ఈ సందర్భంగా చర్చించారు. సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు 2

## డిప్యూటీ సీఎం కాన్వాయ్ మార్గం మార్పు.. ఎస్ఐపై వేటు..!

- కోదాడ రూరల్ ఎస్ఐను వీఆర్‌కు అటాచ్ చేసిన పోలీసు శాఖ
- షెడ్యూల్ రూట్‌కు బదులుగా మరో మార్గంలో కాన్వాయ్
- డీజీపీకి స్వయంగా ఫిర్యాదు చేసిన భట్టి విక్రమార్క
- ఐజీ, ఎస్పీల నుంచి వివరణ కోరిన డిప్యూటీ సీఎం



సూర్యాపేట, జూలై 3 (మనప్రజాప్రతినిధి): సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గోపాల్‌పై పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్‌ను నిర్ణయించిన మార్గంలో కాకుండా మరో మార్గంలో తీసుకెళ్లిన ఘటనపై స్పందించిన అధికారులు, ఎస్ఐ గోపాల్‌ను వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు ముందుగా ఖరారు చేసిన భద్రతా మార్గాన్ని పాటించకుండా ప్రత్యామ్నాయ మార్గంలో తీసుకెళ్లడాన్ని భట్టి విక్రమార్క తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ రాష్ట్ర డీజీపీకి స్వయంగా ఫిర్యాదు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు జోనల్-2 ఐజీ, సూర్యాపేట జిల్లా ఎస్పీలను డిప్యూటీ ముఖ్యమంత్రి వివరణ కోరినట్లు సమాచారం. భద్రతా ప్రోటోకాల్ అమలులో ఎలాంటి లోపం జరిగిందనే అంశంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రాథమిక 2

# మూడో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తోందా...?

మెదటి పేజీ తరువాయి



యుద్ధం వంటి కొత్త రూపాలు సైనిక వ్యూహాల్లో కీలకంగా మారాయి. ప్రపంచంలోని శక్తివంతమైన దేశాలు అత్యాధునిక రక్షణ సాంకేతికతపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ పరిణామాలు భద్రతను పెంచడమే కాకుండా ఆయుధ పోటీని కూడా మరింత తీవ్రతరం చేస్తున్నాయని భద్రతా విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం పరస్పర ఆధారిత వ్యవస్థగా మారింది. ఒక దేశంలో యుద్ధం జరిగినా దాని ప్రభావం చమురు ధరలు, ఆహార సరఫరా, అంతర్జాతీయ వాణిజ్యం, షేర్ మార్కెట్లు, పెట్టుబడులు, రవాణా వ్యవస్థలపై వెంటనే కనిపిస్తోంది. అందువల్ల ఏ దేశమూ పెద్ద స్థాయి యుద్ధాన్ని కోరుకోవడం లేదని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ సంస్థలు, ప్రాంతీయ కూటములు, దౌత్య చర్చలు, శాంతి ఒప్పందాలు ప్రపంచ స్థిరత్వాన్ని కాపాడడంలో ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచంలో చోటుచేసుకుంటున్న ప్రతి ఉద్రిక్త పరిస్థితిని కొందరు మూడో ప్రపంచ యుద్ధానికి సంకేతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులను విశ్లేషించడం అవసరం. సామాజిక మాధ్యమాల్లో నిర్ధారణ లేని సమాచారం వేగంగా వ్యాపించడం వల్ల ప్రజల్లో అనవసర భయాలు పెరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ఆధారంగానే పరిస్థితులను అంచనా వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. శాంతి, సహకారం, సంభాషణకు ప్రత్యామ్నాయం లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రపంచం ఇప్పటికే రెండు ప్రపంచ యుద్ధాల దుష్పరిణామాలను అనుభవించింది. కోట్లాది ప్రాణనష్టం, అపార ఆర్థిక విధ్వంసం, మానవ సంక్షోభం ప్రపంచానికి ఎన్నో పాఠాలు నేర్పాయి. అందుకే నేటి ప్రపంచానికి అత్యవసరమైనది యుద్ధానికి సిద్ధం కావడం కాదు, యుద్ధాన్ని నివారించే మార్గాలను బలోపేతం చేయడం. పరస్పర గౌరవం, దౌత్య సంబంధాలు, అంతర్జాతీయ సహకారం, శాంతియుత చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించే దిశగా దేశాలు అడుగులు వేస్తేనే ప్రపంచం మరింత సురక్షితమైన భవిష్యత్తును నిర్మించుకోగలదు.

# రాయలసీమకు పారిశ్రామిక శక్తి

మెదటి పేజీ తరువాయి



కడప, జూలై 3 (మనప్రజాప్రతితినిధి): కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు, జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సౌర విద్యుత్ ప్రాజెక్టుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో భారీ పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను నాయకులు ప్రస్తావించారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సౌర విద్యుత్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగం మరింత బలోపేతం అవుతుందని, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ అందుబాటులోకి రావడంతో పాటు పర్యావరణహిత అభివృద్ధికి కూడా తోడ్పాటు లభిస్తుందని వివరించారు. పారిశ్రామిక, ఇంధన రంగాల అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దేశంలో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాలనే లక్ష్యానికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్టీల్ ఉత్పత్తి చేసే జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కడపలో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాయలసీమ పారిశ్రామిక పటంలో మరింత కీలక స్థానాన్ని సంపాదిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్, ఎండీ సజ్జన్ జిందాల్, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రాజెక్టుల అమలుతో ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్, సౌర విద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రాయలసీమలో పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పన, అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి ఊతమివ్వనున్నాయని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడుతున్నారు.

# ఏపీ హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు..!

మెదటి పేజీ తరువాయి



సంఖ్య పెరగనుంది. అదనపు న్యాయ మూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో సిఫారసు చేసింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి, రాజ్యాంగ నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియను పూర్తి చేసింది. హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తుంది. కేంద్రం, భారత ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటుంది. అన్ని రాజ్యాంగపరమైన ప్రక్రియలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే న్యాయమూర్తుల నియామకం అమల్లోకి వస్తుంది. కొత్తగా ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకంతో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కావడంతో పాటు న్యాయ వ్యవస్థ పనితీరు మరింత మెరుగుపడే అవకాశం ఉందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# పోలియో నిర్మూలనలో మరో మైలురాయి..!



హైదరాబాద్, జూలై 3 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా పూర్తైందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమిష్టి కృషితో లక్ష్యాన్ని మించి 101.4 శాతం కవరేజీ సాధించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 41,53,185 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. పోలియో బూత్‌లలో టీకాలు అందుకున్న పిల్లలతో పాటు బూత్‌లకు రాని చిన్నారులను గుర్తించి ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు. నిర్మాణ ప్రాంతాలు, అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాలు, వలస కార్మికుల కాలనీలు, మురికివాడలు, శిశు సంరక్షణ కేంద్రాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా ప్రత్యేక బృందాలు పనిచేశాయని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేశారని మంత్రి ప్రశంసించారు. వారి సేవల వల్లే రాష్ట్రం లక్ష్యాన్ని మించి కవరేజీ సాధించగలిగిందని అభినందించారు. ప్రతి చిన్నారికి పోలియో నివారణ టీకా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సహకారం, వైద్య సిబ్బంది కృషితో పోలియో రహిత తెలంగాణ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజారోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ చిన్నారుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలంతా ఆరోగ్య శాఖ చేపట్టే టీకా కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉప ముఖ్యమంత్రికి నివేదిక..!

మెదటి పేజీ తరువాయి




చేస్తున్న వ్యక్తులపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న చర్యలను ఆకే రవికృష్ణ వివరించారు. సాంకేతికతను వినియోగించి నేరాలను అరికట్టడం, బాధితులకు వేగంగా న్యాయం అందించడం కోసం చేపడుతున్న కార్యక్రమాలపై కూడా సమీక్ష జరిగినట్లు సమాచారం. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు చేపడుతున్న ప్రచార కార్యక్రమాలను కూడా అధికారులు వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర భద్రత, ప్రజల రక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు అధికారులు తెలిపారు. డ్రగ్స్ నియంత్రణతో పాటు సైబర్ నేరాల అరికట్టడంలో ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించినట్లు వెల్లడించారు.

# డిప్యూటీ సీఎం కాన్వాయ్ మార్గం మార్పు.. ఎస్ఐపై వేటు..!


మెదటి పేజీ తరువాయి



విచారణ అనంతరం కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌ను విధుల నుంచి తప్పించి వీఆర్‌కు అటాచ్ చేస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ పూర్తయ్యే వరకు ఆయనపై తీసుకున్న చర్యలు అమల్లో ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. వీఐపీ భద్రతా వ్యవహారాల్లో నిర్దేశిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసు శాఖ ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఘటనలో జరిగిన పరిణామాలపై మరింత లోతైన విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. విచారణ నివేదిక ఆధారంగా అవసరమైతే తదుపరి పరిపాలనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మార్గం మార్చడానికి గల కారణాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి శ్రీకారం..!

- రూ. 6.3 కోట్ల పనులకు భూమిపూజ చేసిన లోకేశ్
- యాగశాల, వాహనశాల నిర్మాణాలకు శంకుస్థాపన
- చారిత్రక మండపం పునరుద్ధరణకు చర్యలు
- స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు



మంగళగిరి, జూలై 3 (మనప్రజాప్రతినిధి): మంగళగిరి దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ భూమిపూజ నిర్వహించారు. సుమారు రూ. 6.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నూతన యాగశాల నిర్మాణంతో పాటు వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అలాగే చారిత్రక ప్రాధాన్యం కలిగిన శ్రీకృష్ణదేవరాయ మండపాన్ని పునరుద్ధరించే కార్యక్రమానికీ శ్రీకారం చుట్టారు. ఆలయ సౌకర్యాల విస్తరణతో పాటు భక్తులకు మరింత మెరుగైన వసతులు కల్పించేలా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భూమిపూజ అనంతరం లోకేశ్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారిని, రాజ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు సమాచారం. ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేలా అన్ని సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శిస్తుండటంతో మౌలిక వసతుల విస్తరణ అవసరమైందని అధికారులు పేర్కొంటున్నారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తయిన తర్వాత భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ ఆలయ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# ఉచిత పత్తి విత్తనాలు సబ్సిడీ



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,మద్దూరు, జనగామ:జనగామ నియోజకవర్గం.మద్దూరు మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కొరకు ఉచిత పత్తి విత్తనాల మరియు కందులు సబ్సిడీ పంపిణీ కార్యక్రమాన్ని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామెడీ జీవన్ రెడ్డి,మర్మాముల గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్, చేతుల మీదుగా మండలంలోని రైతులకు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ,మరియు ఏఈవోలు అనూష, కల్పన,రాజు,మరియు వివిధ గ్రామాల రైతులు,మాజీ సర్పంచులు,పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్లో పిల్లలకు యూనిఫార్మ్ పంపిణీ



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ:జనగామ నియోజకవర్గం .చేర్యాల పట్టణం తొమ్మిదవ అంగన్వాడి సెంటర్లో చేర్యాల ఏడో వార్డు కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు.అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న కోడిగుడ్లు పోషకాహారాన్ని పిల్లలు గర్భిణీ స్త్రీలకు అందించడం జరిగింది. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రేణుక,తల్లిదండ్రులు జక్కన్న పల్లి రాము భవాని,సత్యమ్మ,శ్రీలత, లావణ్య,భార్గవి, కీర్తన, నవనీత,ఆయా అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

# భూమి వివాదం. దాడి,బెదిరింపుల ఆరోపణలు



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,తరిగొప్పుల, జనగామ:జనగామ నియోజకవర్గం.భూమి వివాదంలో మాట్లాడినందుకే తమ కుటుంబంపై దాడి చేసి, ప్రాణహాని కలిగేలా బెదిరింపులకు పాల్పడుతున్నారని మహిళా శక్తి కేంద్రం సభ్యురాలు తాళ్లపల్లి సత్యలక్ష్మి ఆరోపించారు.గురువారం తరిగొప్పులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.....భూమి వివాదానికి సంబంధించి బత్తిని సురేందర్ గౌడ్‌తో తన భర్త రాజు గౌడ్ ఫోన్‌లో మాట్లాడిన అనంతరం షాపు వద్దకు పిలిపించి వాగ్వాదానికి దిగారని తెలిపారు.మరుసటి రోజు బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి చిలువేరి లింగం అండదండలతో బత్తిని సురేందర్ గౌడ్,ఆయన కుమారులు తమపై దాడి చేశారని ఆరోపించారు.ఈ ఘటనలో తన భర్తకు గాయాలు కావడంతో జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.అనంతరం ఆస్పత్రికి వెళ్తున్న సమయంలోనూ తమను వెంబడించి బెదిరింపులకు పాల్పడ్డారని సత్యలక్ష్మి ఆరోపించారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తమ కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలని ఆమె కోరారు.

# ప్రజా సమస్యలను పరిష్కరిస్తా
# జనగామ మున్సిపల్ చైర్మన్ బాలమణి శ్రీనివాస్



మన ప్రజాప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజక వర్గం: జనగామ నియోజకవర్గం.జనగామ మున్సిపాలిటీ పరిధిలోని ఏనమీదవ వార్డులో మున్సిపల్ ఛైర్పర్సన్ శ్రీమతి కడకంచి బాలమణి-శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి తో కలిసి పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వార్డులోని అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ,పారిశుధ్యం,తాగునీటి సరఫరా,వీధి దీపాలు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.స్థానికులు తమ సమస్యలను ఛైర్పర్సన్ దృష్టికి తీసుకురాగా,ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపాలిటీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని,ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏనమీదవ వార్డు కౌన్సిలర్ మంజుల, మున్సిపల్ అధికారులు,వార్డు ప్రజాప్రతినిధులు,సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అపహరించిన మహిళా సంఘాల సొమ్మును రికవరీ చేయించాలి



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ:జనగామ నియోజకవర్గం.గ్రామ మహిళా సంఘాలలో అపహరించిన సొమ్మును వెంటనే రికవరీ చేయించి ఈ అపహరణ లో భాగస్వాములైన,మహిళా మండల సమైక్య సిబ్బంది సీసీ పై,బ్యాంకు అధికారుల పైన శాఖా పరమైన,చట్టపరమైన చర్యలు తీసుకోవాలి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం రోజున సిపిఎం బృందం దానం పెల్లి గ్రామ మహిళా సంఘాల సభ్యులను,గ్రామ సమైక్య అధ్యక్ష కార్యదర్శులను అడిగి వాస్తవ విషయాలను తెలుసుకోవడం జరిగింది.అనంతరం కొంగరి వెంకట మావో మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో ఇరవై ఏడు మహిళా సంఘాలు ఉన్నాయని ఈ సంఘాల కు సీఏ గా లింగాల మమత,మహిళా సంఘాల అధ్యక్ష కార్యదర్శుల,గ్రామ ఐక్య సంఘం అధ్యక్ష, కార్యదర్శుల కళ్ళుగప్పి ఈ సంఘాలలో ఎవరికి అనుమానం రాకుండా వ్యవహరిస్తూ బ్యాంకు అధికారుల కను సన్నలలో లక్షలాది రూపాయలు కాజేసినట్టుగా ఆడిట్ నిర్వహిస్తుండగా నిజాలు బయటకు వస్తున్నాయని మహిళా సంఘాల పరంగా బ్యాంకు పరంగా తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయని మహిళా పొదుపు సంఘాల మహిళలు ఎండనక,వాననక కష్టపడుతూ పైసా పైసా కూడబెట్టి తీసుకున్న అప్పుకు వడ్డీ అసలు వాయిదాల రూపంలో నెల నెల చెల్లిస్తుండగా ఎస్బిఐ చేర్యాల బ్యాంక్ అధికారులు,మహిళా సంఘం సిఏ ఇతర సిబ్బంది ఈ వ్యవహారంలో భాగస్వాములై ఇంత పెద్ద మొత్తంలో అపహరణ జరిగిందన ఉంటుందని అన్నారు. ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని వదలకుండా చర్యలు చేపట్టాలని గ్రామంలోని మహిళ సంఘాల సభ్యులు అత్యధికులు నిరుపేదలని ఎంతో కష్టపడి సంపాదించి చెల్లించిన డబ్బు అపహరణ గురవడంతో ఆవేదనతో ఉన్నారని కోల్పోయిన వీరి డబ్బులను లెక్క ప్రకారం పైసా తేడా రాకుండా వీరి అకౌంట్లో జమ చేయాలని లేని పక్షంలో గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు అండగా సిపిఎం ఉంటూ పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సూర్ణ తిరుపతి,నంగి మైసయ్య,బండారి రేకులు గ్రామ ఐక్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాదు పల్లి కళావతి,రజిత,ఎడ్ల సునీత,తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు సూచనలు చేసిన పంచాయతీ సెక్రెటరీ



(మన ప్రజాప్రతినిధి జులై 03):సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని సూరంపల్లి గ్రామంలో డ్రై డేఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.గ్రామ పంచాయతీ సెక్రెటరీ విద్యాసాగర్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ఇళ్ల ఆవరణలు, నీటి నిల్వ ప్రాంతాలు, చెత్త పేరుకుపోయే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ బొల్లం రేణుకతో పాటు గ్రామానికి చెందిన సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# నాగిరెడ్డిపల్లిలో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



మనప్రతినిధి,కోహీర్:కోహీర్ మండలం లోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మల్లేశం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు మల్లన్న పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామ సర్పంచ్ రాజేశ్వరి సురేష్ యాదవ్, మండల పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని గృహప్రవేశం చేసిన కుటుంబాలను అభినందించారు.ఈ సందర్భంగా ప్రజాసంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న గృహ వసతులను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భహర్వాడిలో SIR సహాయ కేంద్రం ప్రారంభం



(మనప్రజాప్రతినిధి), కోహీర్:కోహిర్ మున్సిపాలిటీ భహర్వాడిలోని బీదర్‌బేస్‌లో ఇటీవల ప్రత్యేక సమాచార నమోదు SIR సహాయ కేంద్రంను ఘనంగా ప్రారంభించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి సమర్పించేందుకు వీలుగా పట్టణ అధ్యక్షుడు ముజఫర్ హుస్సేన్ ఈ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.



కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ ఎం. అశోక్, వైస్ ఎంపీపీ షకీర్ అలీ, మాజీ పట్టణ అధ్యక్షుడు షంషేర్ అలీ, మాజీ పోటీ సర్పంచ్ హమీద్ ముఖ్య అతిథులుగా హాజరై కేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు.అలాగే కౌన్సిలర్లు నంచారి శిరీష రాణి, శ్రీకాంత్, అహ్మద్, శంకర్, లగ్గేరి జగదీష్, ఎం.ఎ. వహీద్, రఫీ, అజ్జు పటేల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సహాయ కేంద్రం ద్వారా ఓటర్లు తమ SIR సంబంధిత ఫారాలను సులభంగా పూర్తి చేసి సమర్పించే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# నీరు నిలవకుండాచర్యలు తీసుకోవాలి సర్పంచ్



మన ప్రజా ప్రతినిధి కొండపాక:మండల పరిధిలో ని రాంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వర్షాకాలం నేప థ్యంలో గ్రామంలో ఎక్కడ నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బొమ్మ మల్లయ్య అన్నారు. అనంతరం సర్పంచ్ జేసీబీ తొ కాలువ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టడం జరిగిందని,ప్రతి శుక్రవారం రోజు గ్రామ ప్రజలు తమ ఇంట్లోని నీటి సంపులను శుభ్రం చేసుకోవాలని అన్నారు. గ్రామం లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారనికి కృషి చేస్తానా తెలిపారు.ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి అనిల్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరం సేవ చేస్తూనే ఉంటా



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజక వర్గం: జనగామ నియోజకవర్గం. చేర్యాల మండలం, వేచరేణి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్వాటకం లక్ష్మారెడ్డి కొమరవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్,గత పదిహేను సంవత్సరాల నుండి వేచరేణి గ్రామంలో జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రథమ స్థానం,ద్వితీయ స్థానం,తృతీయ స్థానం, వచ్చిన విద్యార్థులకు రెండు వేల నుండి ఐదు వేల రూపాయల వరకు క్యాష్ ప్రైస్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఇదే కాకుండా కంప్యూటర్స్,హోమ్ థియేటర్, హైదరాబాద్,రోటరీ క్లబ్ ద్వారా బాల బాలికలకు సుమారు ఆరు లక్షల రూపాయల తో టాయిలెట్స్,మరియు వాటర్ ప్యూరిఫైరు,స్కూల్ బ్యాగ్,డ్రెస్సులు,బ్యాడ్జీలు, బెల్టులు,ఇవ్వడం జరిగిందన్నారు.సుమారు రెండు కోట్ల విలువ చేసే తన భూమిని ప్రభుత్వ పాఠశాలకు ఇవ్వడం జరిగింది.దీనికిగాను గ్రామ ప్రజలు శాశ్వత ధాతగా,కొనియాడుతున్నారు.విద్యాశాఖ వారు అతన్ని అభినందించారు.ఈ సందర్భంగా కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సేవలు మునుముందు పేద విద్యార్థులకు తనకు సాధ్యమైనంత వరకు,గ్రామానికి అలాగే చేర్యాల ప్రాంతానికి అందిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు,విద్యార్థులు,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# ముందుకు సాగని రోడ్డు పనులు, పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 3: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వాలు రోడ్డు, రవాణా సౌకర్యం మెరుగుపర్చడానికి ప్రభుత్వం రూ.కోట్లు వేచిస్తుంది కానీ చేగుంట, దౌల్తాబాద్, రెండు మండల ప్రజలకు రోడ్డు నిర్మాణాలకు పలు గ్రామాలకు రహదారి సౌకర్యం కలగానే మిగిలింది. సరియొన రోడ్డుసౌకర్యం లేక, కన్యారం, రాంపూర్, గొల్ల పల్లి, జైత్రం తండా ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. వర్షాకాలంలో అయితే వారి కష్టాలు వర్ణనా తీతం.చేగుంట, దౌల్తాబాద్ రెండు మండలలా గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి 2022 సంవత్సరంలో, కొన్ని వెల కోట్ల రూపాయలు మంజూరు చేసింది. . ప్రారంభంలో పనులు చేపట్టినా, తరచూ బ్రిడ్జి నిర్మాణలు అడ్డు తగలడంతో, వాటిని కొన్ని సంవత్సరాల వరకు పూర్తి చేయలేదు, అవి ఇప్పుడు పూర్తి నిర్మాణం చేపట్టిన,రోడ్డుపై మట్టి పోసి వదిలేశారు. అయితే రెండేళ్లుగా రోడ్డు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గత నేల లో పనులను ప్రారంభించిన, అట్టి పనులు ఇప్పటికీ వరకు రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టని కాకరణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో ఎవరికైనా అనారోగ్య పరిస్థితులు తలెత్తితే ఇక వారు ప్రాణాలను మన చేతిలో పెట్టుకోవాల్సిందే, ఇప్పటికైనా అధికారులు, ప్రజ ప్రతినిధులు, స్పందించి, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజల కోరుకుంటున్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేతి వ్రాత పుస్తకాల పంపిణీ




నేరేడుచర్ల(మనప్రజాప్రతినిధి దినపత్రిక )పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు 6వ తరగతిలో నూతనంగా చేరిన విద్యార్థులకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు కొప్పు లక్ష్మీనారాయణ చేతివ్రాత పుస్తకాలను రూ.4000 లు వెచ్చించి అందించగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, క్లబ్ అధ్యక్షులు ఎస్ కే యూసుఫ్ చేతులమీదుగా పంపిణీ చేశారు అనంతరం వారు మాట్లాడుతూ చేతిరాత అభివృద్ధితో తలరాత మారుతుందని విద్యార్థులు ఇట్టి వ్రాత పుస్తకాల వినియోగంతో చక్కని చేతిరాతకై కృషి చేయాలని, పాఠశాలలో ఇప్పటికే నూతనంగా 78 మంది విద్యార్థులు చేరడం హర్షించదగ్గ విషయమని ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు నమ్మకం పెరుగుతుందనడానికి ఇది నిదర్శనం అన్నారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ డిసి చల్లా ప్రభాకర్ రెడ్డి బాల వెంకటేశ్వర్లు చిత్రం విశ్వనాథ్ నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమల కృష్ణవేణి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# దొడ్డి కొమరయ్య వర్ధంతి సభలను జయప్రదం చేయండి



హైదరాబాద్ (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )ఈనెల 4వ తేదీన తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు బీసీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో తన ప్రాణాలు అర్పించిన తొలి అమరజీవి దొడ్డి కొమురయ్య అని ఆయన మరణం తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి నిచ్చిందని ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ను గద్దె దించేందుకు నాలుగు వేల మంది నవ యువ కిశోరాలు ఆత్మ బలిదానంతో తెలంగాణకు విముక్తి జరిగి భారతదేశంలో విలీనం అయ్యిందని ఈనాడు మనమంత భారతీయుల మని సగర్వంగా చెప్పు చెప్పుకున్నామంటే అది సిపిఐ పార్టీ చేసిన అసమాన త్యాగాల పునాది అని ఆ మహనీయుడు త్యాగాల్ని గ్రామ గ్రామాన వివరించి నేడు పాలకులు అవలంబిస్తున్న తిరోగమన విధానాలను నేటి యువతరానికి వివరించి వారిని చైతన్యపరచి, మతోన్మాదుల కబంధ హస్తాల నుంచి భరతమాతను విముక్తి చేయాలని ఆయన కోరారు నాటి స్వాతంత్ర పోరాటంలోనూ ఆ తర్వాత జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ అలాగే ఇటీవల జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ అశువులు బాసిన వారిలో బీసీలే ప్రథమ స్థానంలో ఉన్నారని త్యాగాలకు ప్రతీకైన బీసీలకు మాత్రం పాలకులు అభివృద్ధిలో తగువాటా ఇవ్వడం లేదని రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా బీసీల వెనకబాటు తనానికి పాలకులు అనుసరిస్తున్న విధానాలే కారణమని అందువల్ల బీసీలు చైతన్యమై న్యాయమైన హక్కుల కోసం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు

# దుద్దెడలో ఘనంగా ప్రపంచ టూ వీలర్ మెకానిక్ డే



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :ప్రపంచ టూ వీలర్ మెకానిక్ డే. సందర్భంగా శుక్రవారం కొండపాక మండలం దుద్దెడ ఫ్రెండ్స్ టూ వీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బ్రహ్మచారి, ఉపాధ్యక్షులు రమేష్ తో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మెకానిక్ వృత్తికి సమాజంలో గుర్తింపు తీసుకురావడానికి ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. టు వీలర్ మెకానికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి, కార్మిక చట్టాల ద్వారా సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని వారు కోరారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి హరిప్, కోశాధికారి ఆంజనేయులు భాస్కర్, శ్రీకాంత్, ఇషాక్, వంశీ, శ్రీనివాస్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో అటెండర్ మృతి



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :దుద్దెడ ఉన్నత పాఠశాలలో అటెండర్ గా పని చేస్తున్న మిద్దె కిష్టయ్య గుండె పోటుకు గురై శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు అన్నారు. గ్రామస్తుల ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న కొండపాక ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి,దుద్దెడ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రజిని, ఉపాధ్యాయులతో కలిసి వెళ్లి కిష్టయ్య మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రభుత్వ తక్షణ సహాయంగా అందించె రూ.30 వేలు,పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు బృందం నుంచి రూ.20 వేలు ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి,ఉపాధ్యాయులు కలిసి మృతుని కుటుంబానికి అందజేశారు. పాఠశాలలో కూడా విద్యార్థులను సక్రమమైన మార్గంలో నడిపించడానికి తనదైన ముద్ర వేస్తూ విధులను నిర్వర్తించేవాడని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. దుద్దెడ వీఆర్ఏ గా పనిచేస్తున్న సమయంలో ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయగా కిష్టయ్య పాఠశాలలో అటెండర్ గా ఉద్యోగంలో చేరాడని గ్రామస్తులు అన్నారు. గ్రామంలో ఎవరికీ ఏ ఆపద వచ్చినా తన్నున్నానంటూ ధైర్యం చెబుతూ ముందుండేవాడని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. కార్మిక సంఘాల నాయకుడిగా చాలాకాలం పని చేసిన కిష్టయ్య ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడేవారని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.

# రైతులకు పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమం




మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ (ఎంసీపీ ) పథకం కింద అధిక సాంద్రత పత్తి సాగు కు అనుకూలమైనటువంటి పత్తి రకాలను రైతులకు 100% రాయితీపై అందజేయడం జరుగుతుందని వ్యవసాయ విస్తరణ శివరామకృష్ణ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు విధానం ద్వారా రైతులకు పంటకాలం తగ్గి రెండవ పంట సాగు చేసుకోవచ్చని, దిగుబడి ఎక్కువగా వస్తుందని, కూలీల ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. మండలానికి 200 ఎకరాలకు సరిపడా పత్తి విత్తనాలు ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడ్డాయని ప్రతి రైతుకి ఒక ఎకరానికి 6 పత్తి ప్యాకెట్లు చొప్పున ఇవ్వడం జరుగుతుందని, మహిళలకు ఎస్సీ ఎస్టీలకు ప్రాధాన్యత ఉంటుంది. కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో ఆగ్రో రైతు సేవ కేంద్రంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు పట్టాదారు పాస్ పుస్తకము ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని వచ్చి డిక్లరేషన్ పై సంతకం చేసి విత్తనాలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రభుత్వం ద్వారా 100% రాయితీపైఇవ్వబడుతున్నటువంటి పత్తి విత్తనాలను సాగుచేసి రైతులు మంచి లాభాలు పొందాలని కొండపాక మండల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు రకాల చెత్త సేకరణపై ప్రజలకు అవగాహనా సదస్సు



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 03: చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో శుక్రవారం ఉపసర్పంచ్ స్వామి, సెక్రటరీ సునంద రాజ్ అధ్యక్షతన నాలుగు రకాల చెత్త సేకరణ పై మహిళలకు, గ్రామస్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా సెక్రటరీ సునంద మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జులై 1 నుండి ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలోనే, చెత్తను వేరు చేసి తడి,పొడి, హానికరా, వేస్ట్, రకాల చెత్తను వేరువేరుగా, గ్రామ సిబ్బంది అందజేయాలని సూచించారు అలా వేరు చేయని వారి నుండి ఎలాంటి చెత్త సేకరించబోమని పేర్కొన్నారు , ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, సెక్రటరీ సునంద, గ్రామస్థులు పాల్గొన్నారు.